క్లుప్తంగా

నేడు మంత్రి పర్యటన

తాడిమర్రి: మంత్రి సత్యకుమార్ గురువారం తాడిమర్రిలో పర్యటించనున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అనంతరం స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో వైశ్యులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరవుతారని బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జ్ గంగులకుంట గోపాల్‌రెడ్డి తెలిపారు.

క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడల్లో పాల్గొన్న విద్యార్థినులు

కదిరి అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం 68వ ఎస్‌జీఎఫ్ నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. నియోజకవర్గ స్థాయి క్రీడల్లో భాగంగా వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు జరగనున్నాయి.

పరిశుభ్రంగా ఉంచుకోండి

బత్తలపల్లి: ఇల్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ సాయిమనోహర్ సూచించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ తమ నివాస ప్రాంతాల్లో చెత్తాచెదారం లేకుండా ఉంచుకుంటే వ్యాధులు దరి చేరవనేది గుర్తెరగాలన్నారు. అదే విధంగా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాల ఆవరణాల్లో పరిసరాలను శుభ్రం చేయించారు. ఈఓఆర్డీ దివాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మితో పాటు వైద్య ఆరోగ్య సిబ్బంది, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలు



పంట దిగుబడిని అంచనా వేస్తున్న దృశ్యం

బత్తలపల్లి: ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుశనగ పంటలో దిగుబడి అంచనా నిమిత్తం అధికారులు పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. బుధవారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని సర్వే నంబర్ 282–1లోని జె.పురుషోత్తం పొలంలో ఏఓ ఓబిరెడ్డి పర్యవేక్షణలో ఏఎస్ఓ డాక్టర్ కెఎస్ లక్ష్మీనరసింహశర్మ పంటకోత ప్రయోగాలు నిర్వహించగా 4,650 గ్రాముల దిగుబడి వచ్చింది. నీటిపారుదల కింద ఈ సర్వే నంబర్ ఉండడం వల్ల దిగుబడి అధికంగా వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ ఉపేంద్రరెడ్డి, వీహెచ్‌ఏ హసీనా, వీఆర్‌ఏ నరసింహులు, టీడీపీ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి జూడో పోటీలకు చిగిచెర్ల విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులు

ధర్మవరం రూరల్: జాతీయ స్థాయి అండర్–14 జూడో పోటీలకు చిగిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ ప్రతాప్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 22 నుంచి 24 వరకు తిరుపతి శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలలో చిగిచెర్ల జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు యశ్వంత్ 35 కేజీల విభాగం, విక్రాంత్ 40 కేజీల విభాగం, అఫ్జల్ మెహరాజ్ 50 కేజీల విభాగంలో (బంగారు పతకం) ప్రథమ స్థానం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. అక్టోబర్ 4 నుంచి 8 వరకు గుజరాత్‌లో జరిగే జాతీయ స్థాయి జూడో పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొంటారన్నారు. ఎంపికైన క్రీడాకారులను హెచ్‌ఎం తిమ్మారెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

పరిశుభ్రత పాటించండి

ధర్మవరం రూరల్: విద్యార్థులు పరిశుభ్రత పాటించాలని ప్రత్యేక అవసరాల విద్యార్థుల రాష్ట్ర పరిశీలకులు శ్రీరామ్ కమల్ సూచించారు. స్థానిక మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. పరిశుభ్రతపై ఆరా తీశారు. అనంతరం పి.నవీన్‌కుమార్‌రెడ్డి అనే దివ్యాంగ విద్యార్థిని పిలిపించి ప్రత్యేకంగా మాట్లాడారు. కంప్యూటర్ రంగంలో ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. ఆ విద్యార్థి చేతి రాతను చూసి అభినందించారు. కార్యక్రమంలో ఎంఈఓ గోపాల్ నాయక్, ఆనంద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

ప్రశాంతి నిలయం: వేద విద్యనభ్యసించిన వారు నిరుద్యోగ భృతికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా దేవదాయ, ధర్మదాయ శాఖ జిల్లా అధికారి నరసింహరాజు బుధవారం ఓ ప్రకటనలో కోరారు.

మిర్చి రైతు కుదేలు



- ఓ వైపు గిట్టుబాటు కాని ధరలు
- మరోవైపు పంటను ఆశిస్తున్న తెగుళ్లు
- పంట పెట్టుబడులూ తిరిగిరాని వైనం



పోట్లమర్రి వద్ద సాగులో ఉన్న మిరప పంట



రాఘవంపల్లి వద్ద పొలంలోనే పండువారుతున్న కాయలను చూపుతున్న రైతు

బత్తలపల్లి: మిర్చి ధరలు భారీగా పతనమవుతున్నాయి. ఇంకో వైపు పంటకు ఆశిస్తున్న తెగుళ్లు దిగుబడులను దెబ్బతీస్తున్నాయి. దీంతో కలవరం మొదలైంది. ధర్మవరం నియోజకవర్గంలో 1,000 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో మిరప సాగైంది. ప్రధానంగా ముదిగుబ్బ మండలంలో 450 ఎకరాలు, తాడిమర్రి మండలంలో 250 ఎకరాలు, బత్తలపల్లి మండలంలో 200 ఎకరాలు, ధర్మవరం మండలంలో 100 ఎకరాలలో మిరప సాగు చేస్తున్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ప్రారంభంలో మిర్చి ధరలు బాగానే ఉన్నాయి. కిలో రూ.40 నుంచి రూ.50 వరకు పలికింది. ప్రస్తుతం కిలో రూ.7 నుంచి రూ.9కి మించడం లేదు. ఒక పక్క తెగుళ్లతో దిగుబడి తగ్గిపోవడం, మరో పక్క ధరలు పడిపోవడంతో రైతులకు పెట్టుబడులు కూడా చేతికి అందే పరిస్థితి లేకుండా పోయింది. కొందరు రైతులు పంటపైనే మిర్చి పండుబారేలా చేసి వాటిని ఎండబెట్టుకొని అమ్ముకునేందుకు ప్రయత్నిస్తున్నారు. మరికొందరు పొలంలోనే వదిలేసుకుంటున్నారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోకపోతే తీవ్రంగా నష్టపోయి, ఇబ్బందులు పడక తప్పదని రైతులు వాపోతున్నారు. రెండు నెలల క్రితం వచ్చిన మిర్చి ధర చూసి వినియోగదారుడు కంటతడి పెట్టాల్సివచ్చేది. అదే ప్రస్తుత ధరతో పంట పండించిన రైతులు కంటతడి పెడుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



నాకున్న రెండు ఎకరా పొలంలో మిర్చి సాగు చేశాను. రూ.80 వేల దాకా పెట్టుబడి పెట్టాను. అందులో రూ.10 వేలు మాత్రమే చేతికి వచ్చింది. రూ.70వేల దాకా నష్టపోయాను. ప్రభుత్వం సాయం చేసి ఆదుకోవాలి. లేనిపక్షంలో మిర్చి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతారు.

– ఇండ్ల రామాంజనేయులు, రైతు, జ్వాలాపురం, బత్తలపల్లి మండలం

వాతావరణ మార్పులతోనే తెగుళ్లు



వాతావరణ మార్పుల కారణంగా మిర్చి పంటకు తెగుళ్లు సోకాయి. నివారణకు మందులు పిచికారి చేసినా ప్రయోజనం లేకుండా పోతోంది. పెట్టుబడులు కూడా చేతికి అదేలా లేవు. దళారులు మాత్రం బాగుపడుతున్నారు.

– కపాదం కాటమయ్య, రైతు, రాఘవంపల్లి, బత్తలపల్లి మండలం

పంటను పొలంపైనే ఉంచాం



నాకున్న రెండు ఎకరాల విస్తీర్ణంలో మిరప సాగుకు, మందులకు, ఎరువులకు ఇతరత్రా ఖర్చులకు దాదాపు రూ.2 లక్షల వరకు ఖర్చయ్యింది. మార్కెట్‌కు మిరప కాయలను తీసుకువెళ్లాలని ఫోన్ చేస్తే కేజీ రూ.8తో అడుగుతున్నారు. పోనీ ఇతర మార్కెట్‌లకు తరలిద్దామా అంటే అక్కడకు తీసుకువెళ్లేందుకు అయ్యే ఖర్చులు పోగా మిగిలేది మాత్రం సున్నాయే. కోత చేయకుండా పంటను పొలంపైనే ఉంచాం.

– జ్వాలా రమణారెడ్డి, రైతు, పోట్లమర్రి, బత్తలపల్లి మండలం.

శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి



చెకుముకి సైన్స్ సంబరాల కరపత్రాలు విడుదల చేస్తున్న జేవీవీ నాయకులు, ఉపాధ్యాయులు

ధర్మవరం అర్బన్: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు, బీఎస్‌ఆర్ పాఠశాల హెచ్‌ఎం ఉమాపతి పిలుపునిచ్చారు. పట్టణంలోని సంజయ్‌నగర్‌లోనున్న బీఎస్‌ఆర్ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం జేవీవీ ఆధ్వర్యంలో పాఠశాలస్థాయి చెకుముకి సైన్స్ సంబరాల పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ మూఢనమ్మకాలు వీడి శాస్త్రీయ దృక్పథం పెంచుకోవాలన్నారు. కాంతి వేగంతో పోటీ పడే రాకెట్లను అంతరిక్షంలోకి పంపుతున్నామని, గురి తప్పకుండా వందల కిలోమీటర్ల ప్రయాణం చేసి లక్ష్యాన్ని ఛేధించగల జలాంతర్గాముల్ని సైన్స్ ద్వారా కనిపెట్టినప్పటికీ మూఢనమ్మకాలు పెరిగిపోతూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. టీవీ సీరియళ్లు, సినిమాలు, యూట్యూబ్ వంటి మాధ్యమాలు ప్రజల్లో మూఢనమ్మకాలను ప్రచారం చేస్తూ సమాజాన్ని అజ్ఞానంవైపు తీసుకుపోతున్నాయని తెలిపారు. అందుకే ప్రతి విద్యార్థీ ప్రశ్నించేతత్వం అలవర్చుకున్నప్పుడే మూఢనమ్మకాలకు దూరంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బిల్లే భాస్కరయ్య, రామకృష్ణనాయక్, హరిశంకర్, గోవిందు, లావణ్య, శివరత్న, పార్వతమ్మ, సుజాత, శ్రీలత, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ ప్రశాంతి

ధర్మవరం అర్బన్: ప్రతి విద్యార్థీ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో బుధవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా కళాశాలలో పిచ్చిమొక్కలను తొలగించి పరిశుభ్రం చేయడంతోపాటు స్వభావ్ స్వచ్ఛత, సంస్కార్ స్వచ్ఛత నినాదంతో కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఒక మొక్క నాటి వాటిని పెద్ద చేసినప్పుడే పర్యావరణాన్ని రక్షించవచ్చని సూచించారు. అనంతరం మొక్కల వల్ల కలిగే లాభాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కుళ్లాయిరెడ్డి, అధ్యాపకులు, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యాంసన్, కేశవ, సిబ్బంది పాల్గొన్నారు.

పెరటికోళ్ల పెంపకంపై అవగాహన

పుట్టపర్తి టౌన్: చిన్న, సన్నకారు రైతులకు అదనపు ఆదాయం చేకూర్చేందుకు పెరటికోళ్ల పెంపకంపై ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా అవగాహన కల్పించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. బుధవారం స్థానిక సాయి ఆరామంలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వాముల ఫామ్ అవుట్‌పుట్ రిస్క్ మిటిగేషన్ అమలుపై వ్యవసాయ, అనుబంధ రంగాల జిల్లా అధికారులు, రైతులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

జీతాలు చెల్లించాలని వినతి

కదిరి అర్బన్: కదిరి వ్యవసాయ పరిశోధన స్థానంలో కాంట్రాక్ట్ పద్ధతిపై పని చేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని బుధవారం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వెంకటేశ్వర్లుకు సీఐటీయూ నాయకులు వినతిపత్రం సమర్పించారు.

ఆ.. విధుల నుంచి విముక్తి కల్పించండి

పుట్టపర్తి: కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలన గురించి ఇంటింటికీ వెళ్లి వివరించడంతో పాటు పోస్టర్లు అతికించే విధుల నుంచి తమకు విముక్తి కల్పించాలని జిల్లాలోని గ్రామ/ వార్డు సచివాలయాల ఏఎన్‌ఎంలు కోరుతున్నారు. ఈ అదనపు విధుల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లోని వైద్య సేవలందించడానికి ఆటంకం కలుగుతుందని పేర్కొంటున్నారు. ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారితో పాటు స్థానిక వైద్యాధికారులకు వినతిపత్రాలు సమర్పించామని చెప్పారు. కలెక్టర్‌కు కూడా లేఖను పోస్టు ద్వారా పంపామన్నారు.

అక్రమాలపై విచారణ చేపట్టండి

ఓడీచెరువు : గ్రామైక్య సంఘాలలో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టి.. బాధ్యులపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఐకేపీ ఏపీఎం రమణప్పకు వినతిపత్రం అందజేశారు.

బస్టాండ్‌లో వ్యాపారాలకు టెండర్ల ఆహ్వానం

ధర్మవరం అర్బన్: ఆర్టీసీ బస్టాండ్‌లోని ఖాళీ స్థలంలో దుకాణాలు ఏర్పాటు చేసుకుని ఐదేళ్ల గడువుతో వ్యాపారం చేసుకునేందుకు సీల్డ్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ధర్మవరం డిపో మేనేజర్ సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్న వారు అక్టోబర్ నాలుగో తేదీలోపు డిపో మేనేజర్ కార్యాలయంలో రూ.885 చెల్లించి టెండర్ ఫారం తీసుకోవాలన్నారు. టెండర్ ఫారాన్ని 5వ తేదీలోపు పుట్టపర్తిలోని జిల్లా ప్రజారవాణా అధికారి కార్యాలయంలోని టెండర్ బాక్సులో వేయాలని సూచించారు.

సంక్షిప్త సమాచారం

సిమెంట్ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ

చెన్నేకొత్తపల్లి: మండలంలోని ప్యాదిండి, చెన్నేకొత్తపల్లి, హరియాన్ చెరువు గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే పరిటాల సునీత బుధవారం భూమిపూజ చేశారు. అనంతరం చండమూరు వద్ద పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

కదిరి అర్బన్: ఆర్టీసీ డిపోలో సూపరింటెండెంట్ (ట్రాఫిక్)గా పెద్దన్న బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మాదిగ ఉద్యోగ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు నాగేంద్రనాథ్, ఎంఈఎఫ్ జాతీయ నాయకులు ఆనంద్, మల్లికార్జున తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

రేపు మెడికల్ క్యాంప్

కదిరి టౌన్: మోకాళ్ల ఆపరేషన్ కోసం పేర్లు నమోదు చేసుకున్న పెన్షనర్లకు కర్నూలు శ్రీచక్ర హాస్పిటల్ డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 27న ఉదయం 10 గంటలకు కదిరి పెన్షనర్స్ భవనంలో మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు శివారెడ్డి, కార్యదర్శి ఆత్మారెడ్డి తెలిపారు. అదే రోజు గుండె వైద్యులు కూడా వస్తున్నారని తెలిపారు.

మధ్యాహ్న భోజనం అమలు చేయాలి

ధర్మవరం: జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రామంజనేయులు, ఆర్‌ఎస్‌వైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి భీమేష్, ఆర్‌ఎస్‌యూ జిల్లా కార్యదర్శి చిరంజీవి కోరారు. పట్టణంలో విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన నిర్వహించారు.

కలెక్టర్‌ను కలిసిన మైన్స్ అండ్ జియాలజీ అధికారి

ప్రశాంతి నిలయం: మైన్స్ అండ్ జియాలజీ జిల్లా అధికారిగా బదిలీపై వచ్చిన అమీర్ భాషా బుధవారం కలెక్టర్ చేతన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు.

'బేటీ బచావో.. బేటీ పడావో'

పుట్టపర్తి: బుక్కపట్నం సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో బుధవారం 'బేటీ బచావో.. బేటీ బడావో' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మక్బుల్ హుస్సేన్, జిల్లా శిశు సంరక్షణ అధికారి మహేశ్ మాట్లాడుతూ పిల్లలు తమను తాము ఎలా రక్షించుకోవాలో తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ ఓబిలేసు, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్టీఐకి సన్మానం



ఎస్టీఐను సన్మానిస్తున్న ఉద్యోగులు, కార్మికులు

పుట్టపర్తి టౌన్: అంకితభావంతో పనిచేస్తే మంచి గుర్తింపు ఉంటుందని వక్తలు పేర్కొన్నారు. పుట్టపర్తి ఆర్టీసీ డిపోలో సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ (ఎస్టీఐ)గా పనిచేస్తున్న పెద్దన్న కదిరి డిపోకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు బుధవారం ఉద్యోగులు, కార్మిక సంఘాలు పట్టణంలోని షాదీ మహల్‌లో ఆత్మీయ సన్మానం చేశారు.

వృద్ధుడికి గాయాలు

ముదిగుబ్బ: మండల కేంద్రం ముదిగుబ్బలో బుధవారం రాత్రి రోడ్డు దాటుతున్న పులివెందుల మండలం మల్యాలకు చెందిన మాబు అనే వృద్ధుడిని ద్విచక్ర వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన వృద్ధుడిని ముదిగుబ్బ ఆస్పత్రికి తరలించారు.

పంటల సాగుపై అవగాహన

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని బడన్నపల్లి, మల్కాపురం గ్రామాలలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. కంది, వేరుశనగ పంట పొలాలను పరిశీలించారు. ఏపీసీఎన్ఎఫ్ ఆధ్వర్యంలో ద్రవ జీవామృతం తయారు చేసే విధానం గురించి రైతులకు వివరించారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

పుట్టపర్తి టౌన్: ధర్మవరంలో రెండు రోజుల కిందట జరిగిన ఘర్షణకు సంబంధించి ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్పీ రత్న తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతవ కాకుండా పోలీసుల బలగాలు ఏర్పాటు చేశామన్నారు. నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ పార్టీలకు అతీతంగా చట్టం ప్రకారం ముందుకు వెళ్తామన్నారు.


కళాశాలను సీజ్ చేయండి

ధర్మవరం: పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేటు మహిళా డిగ్రీ కళాశాలను సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నిరంజన్‌యాదవ్, ఏఐఎస్‌బీ జిల్లా కార్యదర్శి పోతలయ్య, నవీన్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం ఏఓకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని ప్రైవేటు మహిళా డిగ్రీ కళాశాలకు సొంత బిల్డింగ్ లేదని, సెల్‌టవర్స్ ఉన్న కమర్షియల్ కాంప్లెక్స్ భవనంలో కళాశాల ఉండటంతో రేడియేషన్‌తో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు బాబు, విష్ణు, గోపి, యశ్వంత్, రాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ జయంతి

తనకల్లు: మండల కేంద్రంలోని అంబేడ్కర్ కూడలిలో బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు మల్లికార్జున ఆధ్వర్యంలో బుధవారం చాకలి ఐలమ్మ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో రజాకార్ల మీద తిరగబడి సాయుధ పోరాటాలు చేసిన వీర వనితగా ఐలమ్మ చరిత్రకెక్కిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మహబూబ్‌బాషా, ఎస్సీ సెల్ చిన్నప్ప, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సోంపాళ్యం నాగభూషణ, వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్, రైతు సంఘం రమణ, నాయకులు పులి మహేష్, ఓబులేసు, రెడ్డెప్ప, నరేంద్ర, ఆచారి, జానకీరామ్, రాయుడు, నారాయణ, ఆంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

సిల్క్స్ ఫ్యాక్టరీ వద్ద నేడు ధర్నా



ధర్నాకు తరలిరావాలని గీతానగర్‌లో ఇంటింటికీ తిరుగుతున్న నాయకులు

ధర్మవరం: చేనేత రిజర్వేషన్ ఉత్పత్తులను పవర్ లూమ్స్‌లో తయారు చేయడాన్ని నిరసిస్తూ వేల్పుమడుగు క్రాస్ వద్దనున్న జేఆర్ సిల్క్స్ ఫ్యాక్టరీ వద్ద గురువారం ఉదయం 10 గంటలకు ధర్నా చేయనున్నట్లు చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు తెలిపారు. పట్టణంలో గీతానగర్‌లో బుధవారం ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేసి, ధర్నాను జయప్రదం చేయాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు మాధవస్వామి, కార్యదర్శి బాలాజీ, జిల్లా కార్యదర్శి వెంకటనారాయణ, ఎస్‌హెచ్ బాషా, జేవీ రమణ, మోహన్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చేనేత పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు వెంకటస్వామి, ఆదినారాయణ, రవికుమార్, రమణ, లక్ష్మీనారాయణ, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు. చేనేత కార్మికులు పెద్ద సంఖ్యలో దర్నాకు తరలిరావాలని సీపీఐ ధర్మవరం నియోజకవర్గ కార్యదర్శి మునుగు మధు ఓ ప్రకటనలో కోరారు.

పంటల పరిస్థితిని నివేదిస్తాం

సాక్షి ఎఫెక్ట్..

ధర్మవరం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో సాగు చేసిన వేరుశనగ, కంది పంటలను బుధవారం ఏడీఏ క్రిష్ణయ్య, వ్యవసాయాధికారి ముస్తఫా పరిశీలించారు. నియోజకవర్గంలో వర్షాభావంతో పంటలు ఎండుముఖం పట్టాయి. ఈ నేపథ్యంలో 'కరువు.. దరువు' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి వారు స్పందించి ధర్మవరం మండలంలో పర్యటించారు. ఏడీఏ మాట్లాడుతూ ఈ నెలలో వర్షపాతం తక్కువగా నమోదైందన్నారు. పదో తేదీ తర్వాత వర్షం కురవనందున అక్కడక్కడా వేరుశనగ పంట బెట్ట పరిస్థితుల్లో ఉందన్నారు. ఇక్కడి పరిస్థితులను జిల్లా అధికారులకు నివేదిస్తామన్నారు. కాగా కంది పంటకు బెట్ట పరిస్థితులు లేవని స్పష్టం చేశారు.

పేదల సంక్షేమానికి కృషి

తనకల్లు: కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమానికి కృషి చేస్తోందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. మండలంలోని బాలసముద్రంలో బుధవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సామూహిక సీమంతాలు, ఎమ్మార్సీ కార్యాలయంలో జరిగిన ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు.

కళ్లను జాగ్రత్తగా సంరక్షించుకోవాలి

తాడిమర్రి: కళ్లను జాగ్రత్తగా సంరక్షించుకోవాలని ఆప్తాల్మిక్ అధికారి సికిందర్ విద్యార్థులకు సూచించారు. తాడిమర్రిలోని కేజీబీవీలో బుధవారం ఆయన 200 మంది విద్యార్థులకు కంటివైద్య పరీక్షలు నిర్వహించారు. 28 మందికి కళ్ల అద్దాలు అవసరమని గుర్తించారు. ఆప్తాల్మిక్ అధికారి మాట్లాడుతూ రోజూ ఉదయం లేవగానే చల్లని నీటితో కళ్లను శుభ్రపరుచుకోవాలని సూచించారు. తాజా ఆకుకూరలు, క్యారెట్, గుడ్లు, చేపలు, బెల్లం తదితర ఆహార పదార్థాలను తరచుగా తీసుకుంటే కంటి చూపు మెరుగు పడుతుందన్నారు. అనంతరం వైద్య సిబ్బంది నులిపురుగుల నివారణ కోసం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వాణిశ్రీ, ఎంపీహెచ్‌ఎస్ రామ్‌కుమార్, ఆరోగ్య కార్యకర్త జానకీరామ్, ఏఎన్ఎం కోమలి, ఆశాకార్యకర్తలు నరసమ్మ, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో మేధస్సు అభివృద్ధి



ధ్యానం చేస్తున్న విద్యార్థులు

బత్తలపల్లి: రోజూ ధ్యానం చేయడం వల్ల విద్యార్థుల్లో మేధస్సు అభివృద్ధి చెందుతుందని ధ్యాన గురువు నాగేంద్ర అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ధ్యానం చేయించి, ధ్యానం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. ధ్యానం చేయడం వల్ల మెదడుకు చురుకుదనం వస్తుందన్నారు. చదువులు బట్టీ పట్టనవసరం లేకుండా ఉంటుందన్నారు. జనరల్ నాలెడ్జ్ పెరుగుతుందన్నారు. మెదడుకు పదును పెట్టే చెస్సు లాంటి గేమ్స్ ఆడితే విజయాలు సాధించవచ్చన్నారు. పజిల్స్ లాంటివి పూర్తి చేస్తే చురుకైన మేధస్సు అభివృద్ధి అవుతుందన్నారు. ప్రతి విషయాన్నీ క్షుణ్ణంగా తెలుసుకునే వీలవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా వ్యాయామం, యోగా, ధ్యానం అలవాటు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

మెరుగైన వైద్యం అందించాలి



వైద్య సేవలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే సునీత

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే పరిటాల సునీత బుధవారం సందర్శించారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉండి ఇక్కడికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు. రాత్రి సమయంలో డాక్టర్ అందుబాటులో ఉండాలన్నారు.

రూ.1,38,570 రికవరీకి ఆదేశం



ప్రజా వేదిక నిర్వహిస్తున్న అధికారులు

కదిరి అర్బన్: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ అంజనప్ప ఆధ్వర్యంలో బుధవారం సామాజిక తనిఖీపై ప్రజా వేదిక నిర్వహించారు. మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో 01-04-2023 నుంచి 31-03-2024 వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ బృందాలు తనిఖీ నిర్వహించి నివేదికలు సమర్పించాయి. ఇందులో ఉపాధి పనుల్లో రూ.94,163, పంచాయతీ రాజ్ పనుల్లో రూ.44,407 మొత్తం రూ.1,38,570 రికవరీకి ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ విజయప్రసాద్, విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, అంబుడ్స్‌మెన్ శివారెడ్డి, ఎంపీపీ అమర్నాథ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఆనందనాయక్, ఏపీడీ రమేష్‌బాబు, ఏపీఓ శ్రీధర్ పాల్గొన్నారు.

ఘనంగా దీన్‌దయాళ్ జయంతి

పుట్టపర్తి టౌన్: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ మెంబర్ కొండమరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కత్తి రాజారెడ్డి, మీడియా కన్వీనర్ జ్యోతిప్రసాద్, పట్టణ, మండలాధ్యక్షులు బాలగంగాధర్, రామాంజనేయులుతో పాటు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

ధర్మవరం డివిజన్
9912220717, 9912220727,
9912220726, 9010593486